

పెద్దబావి పార్వతమ్మకు నివాళులర్పిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు

పార్వతమ్మకు నివాళి

సరూర్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బడంగ్‌పేట్ 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి తల్లి పార్వతమ్మ దశదిన కర్మ శుక్రవారం ఇక్కడి పీఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, శోభాఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్, కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, బి.గోవర్ధన్‌రెడ్డి, మర్రి హన్మంత్‌రెడ్డి, సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెద్దబావి సమరసింహారెడ్డి, నవారు మల్లారెడ్డి, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, సామ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొని ఆమెకు ఘనంగా నివాళులర్పించారు.



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్-2 ప్రతినిధులు

ఇంద్రప్రస్థకాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

చంపాపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ ఇంద్రప్రస్థకాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు కార్పొరేటర్ సుజాతానాయక్ తెలిపారు. డివిజన్‌లోని ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్-2లో శుక్రవారం కార్పొరేటర్ పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కాలనీ ప్రతినిధులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్పొరేటర్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కాయితీ శేఖర్‌రెడ్డి, నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి: కార్పొరేటర్



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి

సైదాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్‌లో మురుగు సమస్య సత్వర పరిష్కారానికి ఎయిర్‌టెక్ యంత్రాన్ని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ జలమండలి జనరల్ మేనేజర్ ఖాదీర్ మోహినోద్దీన్‌కు శుక్రవారం కార్పొరేటర్ కొత్తకాపు అరుణ వినతిపత్రం సమర్పించారు. అంతేగాకుండా శంకేశ్వర్‌బజార్, ఏకలవ్యనగర్, మాధవనగర్‌లలో నీటి, డ్రైనేజీ నూతన పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మలక్‌పేట బీజేపీ ఓబీసీ మోర్చా కన్వీనర్ గంగిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా అశోక్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అశోక్‌రెడ్డి

వనస్థలిపురం, మార్చి 1(ఆంధ్ర జ్యోతి): వనస్థలిపురం నూతన ఇన్‌స్పెక్టర్‌గా వై.అశోక్‌రెడ్డి శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన బి.రవికుమార్ యాదాద్రి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు.

ఏసీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్



ఏసీపీ కాశిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి

వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా వనస్థలిపురం ఏసీపీ పి.కాశిరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్‌కి ఏసీపీ సూచించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్‌కు ఎస్‌ఐలు, కానిస్టేబుల్స్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌గా అంజిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్‌హెచ్‌వోగా బి. అంజిరెడ్డిని నియమిస్తూ రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. 20 రోజుల క్రితమే ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సైదయ్యను బదిలీ చేస్తూ ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌వోగా పని చేస్తున్న అంజిరెడ్డిని అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.



కుంకుమార్చన పూజలో మహిళలు

ఘనంగా ప్రత్యంగిరా ఆలయ బ్రహ్మోత్సవాలు

- నేడు అమ్మవారికి అన్నాభిషేకం, పల్లకీ సేవ

ఎల్బీనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం ఆదిపరాశక్తి ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి జరుగుతున్న మహానక్షత్ర హారతులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం అమ్మవారికి అన్నాభిషేకం, పల్లకీసేవ జరుగుతుందని ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. చాణిక్యశర్మ, విఠల్ శర్మ, సాయికుమార్‌శర్మ, మునిపల్లె సువర్ణలత, అరుణ, హేమ పాల్గొన్నారు.

ఇంటి పైకప్పుపై పసికందు లభ్యం



ఇంటి పైకప్పుపై లభించిన పసికందు

యాకుత్‌పురా, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జన్మించిన కొద్దిసేపటికే ఓ పసికందును ఇంటి పైకప్పుపై వదిలిపెట్టిన సంఘటన శుక్రవారం రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎ.మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఇమ్లిబన్‌బస్తీలో ఫరాహ్‌బేగం నివాసం ఉంటున్న ఇంటి పైకప్పుపై అపుడే జన్మించిన పసికందును గుర్తుతెలియని వ్యక్తులు వదిలిపెట్టిపోయారు. పసికందు ఏడుస్తున్న శబ్దాన్ని గ్రహించిన ఫరాహ్‌బేగం.. ఇంటిపైకి ఎక్కి పసికందును గమనించింది. దీంతో ఆమె పసికందును ఇంట్లోకి తెచ్చి తల్లిదండ్రుల కోసం వెతికింది. చుట్టుపక్కల ఎవరూ కనపడకపోవడంతో రెయిన్‌బజార్ పోలీసులకు సమాచారం అందించింది. రంగంలోకి దిగిన పోలీసులు పసికందును నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. పసికందుకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే వెంటనే రెయిన్‌బజార్ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

శ్రీకృష్ణాహిల్స్ కాలనీలో కష్టాలు!

- ఐదు నెలలుగా నిలిచిపోయిన భూగర్భ డ్రైనేజీ పనులు
- రోడ్ల వెంట పారుతున్న మురుగు

హయత్‌నగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలల కింద ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆగమేఘాల మీద భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. లైనులో బండరాళ్లు వచ్చాయని కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ఐదు నెలలైనా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో కాలనీలోని మురుగునీరు రోడ్ల వెంట పారుతోంది. ఎవరికి ఫోన్ చేసినా తీయడం లేదని కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని శ్రీకృష్ణాహిల్స్ కాలనీలో నెలకొన్న అసంపూర్తి భూగర్భ డ్రైనేజీ లైన్ పనులు ఇప్పట్లో జరిగేటట్లు కనిపించడం లేదని కాలనీవాసులు తెలిపారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఆటోనగర్ సెక్షన్ పరిధిలోని శ్రీకృష్ణా హిల్స్ కాలనీలో 200 డయాతో భూగర్భ డ్రైనేజీ లైన్ నిర్మాణం కోసం రూ.29.60లక్షలు మంజూరు అయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల ముందు స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటికే పైపులు రావడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ఒక లైన్ పూర్తి చేశారు. శ్రీకృష్ణా హిల్స్‌కాలనీ రోడ్డు నంబర్ 6కు ఎదురుగా ఉన్న రోడ్డు గుండా లైన్ తీశారు. అందులో బండరాళ్లు వచ్చాయి. అంతే కాంట్రాక్టర్ రాళ్లు వచ్చాయని పనులు నిలిపివేశారు. దీంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కాలనీలో మురుగునీరంత రోడ్లపైన పారుతోంది. కాంట్రాక్టర్, ఇంజనీరు ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.



రోడ్లపైన పారుతున్న మురుగు



మన్సూరాబాద్ డివిజన్ శ్రీకృష్ణాహిల్స్ కాలనీలో అసంపూర్తిగా వదిలేసిన భూగర్భ డ్రైనేజీ పనులు

దోమలు.. దుర్గంధవాసన భరించలేక పోతున్నాం



అధికారుల పర్యవేక్షణ లోపం మూలంగా శ్రీకృష్ణా హిల్స్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు నిలిచిపోయాయి. ఇంట్లోని మురుగునీరు బయటకు వచ్చి రోడ్ల మీద పారుతోంది. దీంతో విపరీతంగా దోమలు వస్తున్నాయి. దుర్గంధవాసన భరించలేక పోతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలి.

- వెంకన్నయాదవ్, శ్రీకృష్ణాహిల్స్ కాలనీ

హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారుల నిఘా లోపం..?



మన్సూరాబాద్ డివిజన్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ అభివృద్ధి పనుల్లో హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారుల నిఘా లోపం స్పష్టంగా కనిపిస్తుంది. కార్పొరేటర్ నైనా నాకు కూడా వర్క్ ఆర్డర్ చూపించడం లేదు. ఎంత దూరం శాంక్షన్ అయిందో తెలుసుకోవడానికి రైట్ టూ ఇన్ఫర్మేషన్ ద్వారా వర్క్ ఆర్డర్ తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఉంది. నాణ్యతను ప్రశ్నిస్తున్నందుకు కాలనీవాసులతోనే కాంట్రాక్టర్లు గొడవకు దిగుతున్నారు. డివిజన్‌లో నాణ్యతను గాలికి వదిలేసి పనులు చేస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోవాలి.

- కొప్పుల నరసింహారెడ్డి, కార్పొరేటర్ మన్సూరాబాద్

మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

డ్రైనేజీ లైనులో రాళ్లు వచ్చాయని కాంట్రాక్టర్ పనులు నిలిపి వేసిన మాట వాస్తవమే. రోజూ కాలనీవాసులతో మాట్లాడుతూనే ఉన్నాను. ఈ రోజు మాట్లాడాను. సోమవారం తిరిగి పనులు ప్రారంభం చేయిస్తాం.

- హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఆటోనగర్ సెక్షన్ మేనేజర్ రాజు

ఆస్తిపన్ను వడ్డీ రాయితీ వినియోగించుకోండి : జడ్సీ

- రేపటి నుంచి ఆస్తి పన్ను పరిష్కార కార్యక్రమం

ఎల్బీనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్నుపై వడ్డీలో 90శాతం రాయితీ ఇచ్చిందని జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పి. ముకుంద్ రెడ్డి తెలిపారు. పన్ను బకాయిదారులు ఈ సదావకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఆయన సూచించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి పన్ను బకాయిలు చెల్లించని వారికి వడ్డీలో 90శాతం రాయితీ లభిస్తుందని ఆయన తెలిపారు. అదికూడా పన్ను బకాయి మొత్తాన్ని ఏకకాలంలో చెల్లించిన వారికే వర్తిస్తుందని ఆయన చెప్పారు.



ముకుంద్‌రెడ్డి, జోనల్ కమిషనర్, ఎల్బీనగర్

రేపటి నుంచి ఆస్తిపన్ను పరిష్కారం

ఆస్తిపన్ను విషయంలో ఏదేని సమస్యలుంటే వాటిని పరిష్కరించుకోవడానికి మార్చి 3 నుంచి ప్రతి ఆదివారం ఆస్తిపన్ను పరిష్కారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. మార్చి 3, 10, 17, 24, 31 తేదీలలో ఆస్తిపన్ను పరిష్కారం కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని సర్కిల్ కార్యాలయాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆయన సూచించారు.

మలక్‌పేట ఆస్తిపన్ను టార్గెట్ రూ.38.18కోట్లు

- వసూలైంది రూ.24.27కోట్లు
- 30 రోజుల్లో వసూలు కావాల్సింది రూ.13.91కోట్లు

చాదర్‌ఘాట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో ఆస్తి పన్ను వసూలు ముమ్మరంగా సాగుతోంది. 2023-24కు గాను సర్కిల్-6లోని 56,577 ఆస్తుల నుంచి ఆస్తి పన్నులు రూ.38.18 కోట్ల వరకు వసూలు చేయాలని గ్రేటర్ కమిషనర్ టార్గెట్ విధించారు. 11 నెలల నుంచి ఆస్తిపన్నుల ద్వారా ఫిబ్రవరి 29వ తేదీ నాటికి రూ.24.27కోట్ల వరకు వసూలు చేశారు. ఇంకా ఈ నెలాఖరు నాటికి రూ.13.91కోట్లను వసూలు చేయాల్సి ఉంది.

వసూళ్లపైనే బిల్ కలెక్టర్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లు

ఆస్తి పన్నుల వసూలు కోసం 8మంది టాక్స్ ఇన్‌స్పెక్టర్లను నియమించింది. వీరితోపాటు మరో 11 మంది బిల్ కలెక్టర్లు పనిచేస్తున్నారు. వీరంతా ఆస్తిపన్ను వసూళ్లపైనే దృష్టి సారించాల్సి ఉంటుంది. మామూలుగా వీరికి కేవలం ఆస్తిపన్నుల వసూలు బాధ్యతలతోపాటు ఎన్నికల విధులను కూడా అప్పగించడం వల్లే వసూళ్లలో కొంత జాప్యం జరుగుతుంది. అయినప్పటికీ వీలు కలిగినప్పుడల్లా ఆస్తి పన్నుల వసూలుపైనే దృష్టిని కేంద్రీకరించారు. అయినప్పటికీ గ్రేటర్ కమిషనర్ విధించిన టార్గెట్ రూ.38.18కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఫిబ్రవరి మాసాంతానికి రూ.24.27కోట్లను వసూలు చేశారు. మార్చి మాసాంతానికి రూ.13.91 కోట్లను వసూలు చేయాల్సిన బాధ్యత 8 మంది టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, 11 మంది బిల్ కలెక్టర్లపై ఉంది.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే..

ఈ నెల రెండో వారంలో పార్లమెంట్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముంది. ఒకవేళ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే ఇంతవరకు ఆస్తి పన్నుల వసూలు కోసం విధులు నిర్వహిస్తున్న టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు మళ్లీ ఎన్నికల విధుల్లో నిమగ్నం కావాల్సి ఉంటుంది. ఆస్తి పన్ను వసూళ్ల కోసం ఉన్న రూ.13.91 కోట్లలో ఎంత వరకు వసూలవుతుందనేది ప్రశ్నార్థకంగా మారే అవకాశముంది.

సర్వే నంబర్ 268లో అక్రమ మైనింగ్‌పై విచారణ

- వివరాలు సేకరించిన తహసీల్దార్, మైనింగ్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బండరావిరాల సర్వే నంబర్ 268లో కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌పై అధికారులు విచారణ చేపట్టారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ చిన్నరావిరాల గ్రామానికి చెందిన రామిడి బాల్‌రెడ్డితో పాటు పలువురు రైతులు ఫిబ్రవరి 12న ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ స్థానిక తహసీల్దార్‌తో పాటు మైనింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దాంతో శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ బండరావిరాల సర్వే నంబర్ 268లోని మైనింగ్ జోన్‌ను సందర్శించారు. సదరు సర్వే నంబర్‌లో అక్రమంగా కొనసాగుతున్న క్రషర్ల వివరాలు సేకరించారు. మైనింగ్ జోన్‌లో మొత్తం ఎన్ని క్రషర్స్ ఉన్నాయి.. ఎన్నింటికి మైనింగ్ అనుమతులు ఉన్నాయి.. ఎప్పటి వరకు ఉన్నాయి తదితర వివరాలు సేకరించారు. ఒక్కొక్క క్రషర్ వద్దకు వెళ్లి వాటి అనుమతులను పరిశీలించారు. దీంతో పాటు క్రషర్స్ వల్ల అక్కడి రైతులు, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు, కాలుష్య ప్రభావంపై వివరాలను సేకరించారు. అన్ని క్రషర్‌లలో విచారణ చేసేందుకు కొంత సమయం పడుతుందని సమగ్ర విచారణ అనంతరం నివేదికను ఉన్నత అధికారులకు అందిస్తామని తహసీల్దార్ తెలిపారు. లీజు అనుమతులు లేకుండా కొనసాగుతున్న క్రషర్‌లలో మైనింగ్ పనులను నిలిపివేయిస్తున్నామని తెలిపారు. నిబంధనలను ఉల్లంగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.



మైనింగ్ జోన్‌లో క్రషర్ వద్ద వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ రవీందర్‌దత్, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ తదితరులు

స్క్రాప్ కారులో అగ్నిప్రమాదం

చాదర్‌ఘాట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్క్రాప్ కారు శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదానికి గురైంది. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట వాహేద్‌నగర్‌లోని గోల్నాకా బ్రిడ్జి సమీపంలో ఉన్న ఏ1 ఫంక్షన్ హాల్ ముందున్న ఫుట్‌పాత్‌పై పాడైన మారుతి స్విఫ్ట్ కారును మరమ్మతుల కోసం తీసుకువచ్చారు. దానికి సంబంధించిన స్పేర్ పార్ట్స్ కొరత కారణంగా అందులోని మిగతా పార్ట్స్‌ను వేరువేరుగా అమ్మేశారు. స్క్రాప్‌కు సిద్ధం చేశారు. ఇంతలో శుక్రవారం మధ్యాహ్నం ఈ స్క్రాప్ కారు నుంచి మంటలు లేవడంతో స్థానికులు గమనించి చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇవ్వగా హుటాహుటిన చేరుకుని అగ్నిమాపక దళాన్ని రప్పించారు. మంటలను అదుపు చేసిన తర్వాత వివరాలు సేకరించగా స్క్రాప్ కారు అని తేలింది. అయితే ఈ కారు ఎవరిదనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



బాలాపూర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ అమరులకు నివాళులర్పిస్తున్న రవిమాదిగ

ఎమ్మార్పీఎస్ అమరుల త్యాగం మరువలేనిది

సరూర్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఎమ్మార్పీఎస్ అమర వీరుల త్యాగం ఎన్నటికీ మరువలేనిదని జిల్లా నాయకుడు బొర్ర రవిమాదిగ అన్నారు. వర్గీకరణ ఉద్యమంలో భాగంగా నిర్వహించిన ఆందోళనలో అమరులైన కార్యకర్తలను స్మరించుకుంటూ శుక్రవారం బాలాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి ఫ్లెక్సీకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందితేనే అమరుల త్యాగానికి తగిన ఫలితం దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు వీర్లపల్లి కిష్టయ్య, చింతల చిన్నా, అడ్డాకుల సురేశ్, డీకే నర్సింహ, దాసరి మహేందర్, అలంపల్లి అంజయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్



ఏసీబీకి పట్టుబడిన విద్యుత్ ఉద్యోగి

ఉప్పల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హబ్సిగూడలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. జూనియర్ అకౌంట్స్ అధికారి తోటి ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాచారం ఏడీఏ కార్యాలయంలో ఆర్టిజెన్‌గా పనిచేస్తున్న భరత్ తనకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో హబ్సిగూడ విద్యుత్ కార్యాలయంలో(టీఎస్ఎస్‌పీడీఎస్ఎల్) జూనియర్ అకౌంట్స్ అధికారి విజయసింహారెడ్డిని సంప్రదించాడు. 14 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. రూ.35 వేలు లంచం ఇస్తే కానీ తనకు రావాల్సిన బకాయిలు విడుదల చేయడం కుదరదని విజయసింహారెడ్డి చెప్పాడు. దీంతో హైదరాబాద్-2 యూనిట్ ఏసీబీ అధికారులను భరత్ ఆశ్రయించాడు. భరత్ నుంచి రూ.35వేలు లంచాన్ని విజయసింహారెడ్డి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలించారు.

అవినీతి అధికారులను పట్టిస్తే నజరానా

మహేశ్వరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించిన వారికి కేఎల్లార్ ట్రస్టు ద్వారా రూ.లక్ష నజరానా అందజేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధి తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి అధికారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించదని తెలిపారు.

కుమ్మరుల సమస్యలను పరిష్కరించాలి

- ఉప ముఖ్యమంత్రికి వినతి



ఉప ముఖ్యమంత్రిని కలిసిన వీరభోగ వసంతరాయలు ప్రజాపతి

ఎల్బీనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుమ్మరి కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వీరభోగ వసంతరాయలు ప్రజాపతి కోరారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో కుమ్మరి కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. ప్రభుత్వం తరఫున కుమ్మరులను ఆదుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కుమ్మరులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా చాలా వెనుకబాటు తనానికి గురయ్యారని ఆయన వివరించారు. ఆర్థికంగా వెనకబడిన కుమ్మరులకు కుమ్మరి బంధుతో పాటు నెలనెలా పెన్షన్ ఇవ్వాలని ఆయన కోరారు. రాజకీయంగా వెనకబడి ఉన్నందున నామినేటెడ్ పదవులతో పాటు స్థానిక సంస్థలు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికలలో అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు.

విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్‌ఫెయిర్‌లు దోహదం



చంద్రయాన్ పరికరంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎల్బీనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి సైన్స్‌ఫెయిర్‌లు ఎంతగానో ఉపకరిస్తాయని దిల్‌సుఖ్‌నగర్ శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ దీప అన్నారు. జాతీయ సైన్స్‌ఫెయిర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో గురువారం నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. వ్యర్థ పదార్థాలనుపయోగించి అద్భుత పరికరాలను రూపొందించిన విద్యార్థుల ప్రతిభను ఆహూతులు కొనియాడారు. ప్రదర్శనలో హెచ్‌ఓడీ ప్రణీత ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన చంద్రయాన్-3 రోబో నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో శాస్త్రవేత్త థామస్, ఏజీఎం సతీష్, డీన్ శ్రీనివాస్, ఆర్ఐ రవీందర్‌రెడ్డిలతోపాటు నవీన్, పద్మజ, జరీన పాల్గొన్నారు.

ఫైనాన్స్ వ్యాపారి వద్దకు మరో వ్యక్తితో వెళ్లిందని భార్యపై భర్త దాడి

- మరో ముగ్గురిపైనా చేయిచేసుకున్నవైనం

సైదాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తనకు తెలియకుండా ఫైనాన్స్ వ్యాపారి వద్దకు మరో వ్యక్తిని భార్య తీసుకెళ్లిందన్న కోపంతో భర్త దాడి చేయడంతో ఆమెతోసహా ముగ్గురు గాయపడ్డారు. సైదాబాద్‌కు చెందిన ఫైనాన్స్ వ్యాపారి జగదీశ్ వద్ద ఎల్బీనగర్‌కు చెందిన మౌనిక, హనుమంతు దంపతులకు కొన్ని నెలల క్రితం జీహెచ్‌ఎంసీ ఉద్యోగి వాకిటి వరప్రసాద్ మధ్యవర్తిగా ఉండి రూ.40 వేలు అప్పు ఇప్పించాడు. కొద్ది నెలలుగా వాయిదాలు సక్రమంగా చెల్లించి అనంతరం మానేశారు. డబ్బు విషయమై జగదీశ్ వరప్రసాద్‌ను ఒత్తిడి చేస్తున్నాడు. మౌనిక, హనుమంతు దంపతులను సైదాబాద్‌లో తన కార్యాలయానికి తీసుకురావాలని ఫైనాన్స్ వ్యాపారి అతడిని హెచ్చరించాడు. దీంతో మౌనిక చంద్రశేఖర్ అనే వ్యక్తిని తీసుకొని గురువారం రాత్రి జగదీశ్ కార్యాలయానికి వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె భర్త హనుమంతు క్రోధోదిక్తుడై కత్తెరతో వెళ్లి భార్య, చంద్రశేఖర్‌పై దాడి చేశాడు. అడ్డుకునేందుకు యత్నించిన వరప్రసాద్‌పై కూడా దాడి చేశాడు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సైదాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గంచెరువులో అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ?

- నిపుణుల కమిటీ సిఫార్సులు అమలు చేయాల్సిందే
- హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరానికి తలమాణికంగా ఉన్న దుర్గంచెరువు పునరుద్ధరణకు నిపుణుల కమిటీ చేసిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక సిఫార్సులపై ఏం చర్యలు తీసుకున్నారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దుర్గంచెరువులో చేపలు చనిపోయి పైకితేలిన పరిస్థితిపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా ఈ అంశాన్ని హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. చెరువు పునరుద్ధరణకు హైకోర్టు నియమించిన నిపుణుల కమిటీ పరిశీలన జరిపి జలకాలుష్యం నివారణ సహా పలు సిఫార్సులు చేసింది. ఈ పిటిషన్‌పై తాజాగా శుక్రవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎఫ్‌టీఎల్‌లో 78, బఫర్‌జోన్‌లో 146 అక్రమ నిర్మాణాల తొలగింపునకు ఏయే చర్యలు తీసుకున్నారని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డిని ప్రశ్నించింది. 160 ఎకరాల్లో ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారని, ఫైనల్ నోటిఫికేషన్ ఎందుకివ్వలేదని అడిగింది. శుద్ధిచేయని మురుగునీరు చెరువులో చేరుతోందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం సమర్పించిన స్టేటస్ రిపోర్ట్‌లో నిపుణుల కమిటీ సిఫార్సులు అమలు చేస్తామని పేర్కొన్నారే తప్ప.. దానికి కాలపరిమితిని పేర్కొనలేదని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను మార్చి 11కు వాయిదా వేసింది.